International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.3, Issue-3(2), March, 2016
Impact Factor: 3.075; Email: drtvramana@yahoo.co.in

# గ్రామదేవతారాధన - తులనాత్మక పరిశీలన

**డా. యం. విజయలక్ష్మి**
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆర్.బి.వి.ఆర్.ఆర్. మహిళా కళాశాల, హైదరాబాద్

సుమారు 200 కోట్ల సంవత్సరాల పూర్వం సముద్రం జలాల్లో జీవరాశి ఆవిర్భవించాక భూమిపైన పశు పక్ష్యాదులు ప్రభవించాయని వానిలోని కొన్ని వానర జాతులు పరిణామ క్రమంలో మానవ రూపాలుగా మారినాయని పురాతత్త్వ శాస్త్రజ్ఞుల ప్రతిపాదన. ఆదిమానవుడు అడవుల్లో, కొండల్లో, గుహల్లో జంతువుల మాదిరిగ నగ్నంగా జీవిస్తూ, ఆకలి తీర్చుకోవడానికి పండ్లు, దుంపలు, ఆకులనే గాక జంతువులను వేటాడి పచ్చి మాంసాన్ని తింటూ కొన్ని వేల సంవత్సరాలు గడిపిన పిదప ఒరపిడి ద్వారా నిప్పును కనుగొని మాంసం మొదలైన వాటిని కాల్చుకొని తినుటను అలవాటు చేసుకొన్నాడు. అంతేగాక చలికాలంలో నిప్పును, తోళ్ళను ఉపయోగించి శీతోష్ణ స్థితులను నిగ్రహించుకొనే స్థితికి ఆదిమానవుడు ఎదిగాడు.

క్రూరమృగాల మధ్యన ప్రకృతి వైపరీత్యాలకు భయపడుతూ జీవిస్తున్న ఆదిమానవుడు ఈ వైపరీత్యాలన్నింటికి ఏదో ఒక మూలశక్తి కారణమని ప్రకృతి అంతా ఆ శక్తి ఆధీనంలోనే ఉందని విశ్వసించి, ఆ శక్తిని ఉగ్రశక్తిగా భావించుకొని దాన్ని మంచి చేసుకోవడానికి ప్రయత్నించాడు. మనిషికి ఆత్మఅనేది ఉంటుందని మనిషి మరణించాక ఆ ఆత్మ తనను పూజించిన వారికి మేలు చేస్తుందని లేకుంటే కీడు చేస్తుందని నమ్మాడు. ఈ ఆత్మ ప్రకృతిలో కనిపించే చెట్లు చేమల్లో, జంతువుల్లో కూడా ఉంటుందని విశ్వసించి, మృతాత్మలతోపాటు చెట్లను, పశువులను పూజించ సాగాడు. ఇలా ప్రకృతి వైపరీత్యాలు, ప్రేతాత్మల వలన కలిగిన భయమే భగవంతుని రూపకల్పనకు దారితీసి వుండవచ్చు. అంతేగాక సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాయువు, పర్వతాలు, నదులు మొదలైనవి తమ అవసరాలను తీర్చడంతో పాటుగా తమకు ఉపకారం చేయడం వలన వాటిపట్ల కృతజ్ఞత భావాన్ని కలిగి ఉంటూ వాటికి కూడా దైవ స్థానాన్ని కల్పించి పూజించాడు. సూర్యోదయం, సూర్యాస్తమయం చంద్రోదయం, ఉరుములు, మెరుపులు, వర్షం వంటివి ఆశ్యర్యాన్ని కల్గించడమేగాక అవి ఎందుకు అలా జరుగుతున్నాయో తెలుసుకొనే జ్ఞానం లేని ఆనాటి మానవుడు వాటికి కూడా భగవంతుని స్థానాన్ని కల్పించి, పూజించాడు. ఈ విధంగా భయం, కృతజ్ఞత, ఆశ్చర్యాలు దేవుని కల్పనకు దారితీసి, దేవతాగణ ఉద్భవానికి కారణాలై యుండవచ్చు.

తనకు ఉపకార మొనర్చువానిలో దేవతాంశ కలదని, అపకారమొనర్చు వానిలో రాక్షసాంశ కలదని విశ్వసించిన ఆదిమానవుడు జీవనాధారాలేగాక ప్రయోజన కారకాలైన అగ్ని, వాయువు, వర్షం, వృక్షాలు, సూర్య చంద్రులు, రాయిరప్పల వంటి సజీవ నిర్జీవ వస్తువులను దేవతలుగా భావించి, ఆహారం కొరకు, ప్రకృతి విలయ తాండవాలనుంచి రక్షణ కొరకు వ్యక్తిగతంగాను, సామూహికంగాను ఆరాధించాడు. ఇలా కొంతకాలం గడిచాక వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టాక, సంచార జీవనానికి స్వస్తి చెప్పి గ్రామాలను నిర్మించుకొని, స్థిరనివాసాలేర్పరచుకొన్నాడు. గ్రామాలరక్షణ కొరకు, పంటలు బాగా పండడానికి, సకాలంలో కురవడానికి, రోగాల నివారణకు – ఇలా ఎన్నో వాటి కొరకు తాము నమ్మిన దైవాన్ని (అతీత శక్తిని)పూజిస్తే తమ కోరికలు నెరవేరునన్న నమ్మకం ఏర్పడింది. అదే కాలక్రమాన మాతృదేవతారాధనకు దారి తీయడం జరిగింది.

ఈ విధంగా గ్రామాలను నిర్మించుకొనిన పిదపనే మాతృదేవతారాధన గ్రామ దేవతారాధనగా రూపుదిద్దుకొందన్న విషయాన్ని హెన్రీవైట్ గారు ఈ కింది విధంగా తెలియజేశారు.

"Probably these village duties came into being at the period when the People began to settle down in agricultural communities" అంటే ఆదిమానవులు వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టి ఒక జాతిగా ఎప్పుడు స్థిరపడ్డారో అప్పుడే ఈ గ్రామ దేవతల ఆవిర్భావం జరిగిందని అర్థం.

**గ్రామ దేవతలను కొలవడానికి గల కారణాలు :**

1. గ్రామ దేవతలు తమను పూజించిన వారికి మేలు చేస్తాయని పూజించని వారికి కీడు చేస్తాయన్న నమ్మకం.
2. గ్రామ దేవత సరిహద్దులను కాపాడుతుందన్న నమ్మకం.
3. దుష్టశక్తుల బారి నుండి రక్షిస్తాయని నమ్మకం.
4. గ్రామ దేవతలను పూజిస్తే వర్షాలు పడతాయన్న విశ్వాసం
5. వ్యాధుల బారి నుండి తమనేగాక తమ పశువులను కూడా రక్షిస్తాయన్న నమ్మకం

పైన కారణాల వలన ప్రజలు ఈ గ్రామదేవతలను భక్తి కన్నా భయంతోనే ఎక్కువగా ఆరాధిస్తారని తెలుస్తుంది.

దేశ సౌభాగ్యానికి గ్రామసీమలే పట్టుగొమ్మలు గనుక గ్రామ రక్షణ బాధ్యతను ప్రాచీన మానవుడు గ్రామదేవతలకే అప్పగించాడు. గ్రామాలను గ్రామ దేవతలే రక్షిస్తాయని, గ్రామ దేవత లేని గ్రామానికి అరిష్టం కలుగుతుందని ఏడాదికొక సారైనా దేవతను ఆరాధించకుంటే ఆమె ఆగ్రహానికి గురయ్యే ప్రమాదముందని నమ్మిన గ్రామ ప్రజలు గ్రామానికొక దేవత చొప్పున గ్రామ దేవతలను ఏర్పరచుకొని పూజిస్తున్నారు. ఇలా శిష్ట దేవతలు (వెంకటేశ్వరుడు, రాముడు, కనకదుర్గ మొ॥) ఎందరున్నప్పటికిని గ్రామ ప్రజలకు మాత్రం గ్రామ దేవతల పట్ల అచంచల భక్తి విశ్వాసాలుండడం వలన గ్రామానికొక దేవత ఏర్పడి పెక్కు మంది గ్రామ దేవతలు ఆవిర్భవించారు.

**గ్రామ దేవతల లక్షణాలు :**

- గ్రామ దేవతలలో స్త్రీ, పురుష దేవతలున్నప్పటికిని ఆధి అధిక్యత మాత్రం స్రీత దేవతలదే. గ్రామ దేవతల పేర్ల చివర అమ్మ అనే పదాన్ని చూస్తుంటాం. అమ్మ అంటే తల్లి. తల్లి తన బిడ్డలను ఏ విధంగా పెంచి పోషించి కాపాడుతుందో అదే రీతిగా గ్రామ దేవత కూడా ఆ గ్రామ ప్రజలను కంటికి రెప్పలా దుష్టశక్తుల బారిన పడకుండా కాపాడుతుందన్న నమ్మకంతో దేవతను ఎక్కువగా స్త్రీ మూర్తి రూపంలో కొలవడం జరిగింది.

- రాయిరూపంలోను, చెట్ల రూపంలోను దేవతను భావించి కొలిచిన ప్రాచీన మానవుడు కాలక్రమేణా తన రూపాన్నే దేవతకు ఆపాదించినప్పటికిని కొన్ని ప్రత్యేక లక్షణాలను దేవతకు కల్పించాడు. అవి – రెండు కన్నా ఎక్కువ చేతులను కలిగి యుండడం, కళ్ళు పెద్దవిగా ఉండి, నోటి కిరువైపులా కోరలతో, నాలుకను బైటకు చాచి, చూచేవారికి భయాన్ని కల్గించేరీతిగా దేవత రూపకల్పన గావించాడు. ఇలా భయంకర రూపకల్పన చేయడానికి ఈ క్రింది రెండు కారణాలను చెప్పచ్చు.

(అ) ఆదిమానవుడు క్రూరమృగాల మధ్యన కొండలలో, అడవులలో జీవిస్తున్నప్పుడు తాను చూసిన దృశ్యాలు, అద్భుత రూపాలను బట్టి మానవుని కంటే భిన్నమైన రూపంలో శక్తిని భయంకరంగా ఊహించియుండుట.

(ఆ) దుష్టులైన రాక్షసులు అనేక శక్తులను కలిగియుండి, దేవతలను ప్రజలను నానాహింసలకు గురి చేస్తుండేవారు. అటువంటి రాక్షసులను శిక్షించుటకై ఆది శక్తి ఉగ్రరూపాన్ని దాల్చడమే గాకుండా రాక్షస సంహారం చేయునప్పుడు రక్తం కిందపడి తిరిగి ఉద్భవించకుండా ఉండడానికి భూమంత నాలికను చాచి ఆరక్తాన్ని నాకేస్తుంది. ఈ ఆదిశక్తి అంశలే గ్రామ దేవతలు గనుక వీరి రూపాన్ని అంత భయంకరంగా చిత్రించియుండవచ్చును.

- గ్రామదేవతలు దుష్టశక్తుల బారి నుండి గ్రామాలను రక్షిస్తాయని ప్రజల విశ్వాసం. దేవత అనుగ్రహిస్తే ఆ గ్రామాలు పశు, ధాన్య సంపదలతో కలకల లాడునని, దేవత ఆగ్రహిస్తే అతివృష్టి, అనావృష్టి, కరువు కాటకాలు, అంటువ్యాధులు వ్యాప్తి, పశువులకు రోగాలు వంటివి సంభవిస్తాయని ప్రజల నమ్మకం, అందువలన ప్రజలు ఈ దేవతలను భక్తి కన్నా భయంతోనే ఆరాదిస్తారు.

- దేవతను నిర్లక్ష్యం చేసి పూజలు ఉత్సవాలు జరిపించకపోతే గ్రామ ప్రజలను రోగాలు, కష్టాల బారిన పడవేస్తుందని దేవత అనుగ్రహాన్ని పొందడానికి ఏడాదికొక సారైనా బలులను, నైవేద్యాలను సమర్పించి, పూజలు, ఉత్సవాలు, జాతరలు వంటివి జరిపేవారు. జాతర / ఉత్సవ సమయంలో దేవత పూనకరూపంలో ఎవరినో ఒకరిని ఆవహించి కోరికలను కోరడం, భవిష్యత్తును గురించి చెప్పడం జరుగుతుంది. భక్తులు కోరిన కోర్కెలను తీర్చడం జరుగుతుంది.

- గ్రామదేవతకు నర / జంతు బలి, రక్తపానమన్న ప్రీతియని ప్రజలవిశ్వాసం. అందువలన జాతర / ఉత్సవ సమయాలలోనే గాక కోరిన కోర్కెలు నెరవేరితే కృతజ్ఞతా భావంతో మొక్కుబడిగా మద్యం, మాంసాన్ని నివేదించడం జరుగుతుంది. ఇది ప్రజల్లో ఉన్న మూఢ విశ్వాసం మాత్రమే. ఇలా చేయడానికి గల కారణం ఆదిమానవుడు జంతువులను వేటాడి పచ్చి మాంసాన్ని తినే రోజుల్లో ఆహారం దొరికినందుకు కృతజ్ఞతను తెల్పడమేగాక తినేదాంట్లో ఏ దోషమున్నా పోతుందన్న నమ్మకంతో ముందుగా దానిని దేవతకు అర్పించి ఆ తరువాత తినేవాడు. ఈ అలవాటే తరతరాలుగా అనుసరించబడుతూ ఆచారంగా

రూపుదిద్దుకొని ఇప్పటికీ మద్య మాంసాలను దేవత కర్పించడమనేది కొనసాగుతూనే ఉంది.

– ఇలా బలి ఇవ్వడం అంటే ఆహుతి ఇవ్వడం లేదా కానుక అర్పించడం అనే అర్థం మరుగున పడిపోయి నర / జంతు బలి నివేదనయే బలి అన్న అర్థంతో మిగిలిపోయింది. నర / జంతు బలిని దేవుని పేరిట ఇవ్వడం హింస కాదని, బలి యివ్వడం వలన అవి స్వర్గలోకానికి వెళ్ళడమేగాక బలి ఇచ్చిన వానికి కూడా ఎటువంటి పాపముండదని దేవీ భాగవతంలో చెప్పబడింది.

**జంతు బలిగా ఇవ్వడం :**

భగవంతుని అనుగ్రహాన్ని సంపాదించడానికి ఆత్మ నివేదనను మార్గంగా ఎంచుకొన్న మానవుడు మరొక ప్రాణిని అంటే జంతువులనుగాని, పక్షులను గాని బలి ఇవ్వడం మొదలుపెట్టాడు. దీనికి సంబంధించి బైబిల్ పరిశుద్ధ గ్రంథంలో అబ్రహం తన కుమారుడైన ఇస్సాకునకు బదులుగా దేవునికి పొట్టేలును బలి ఇచ్చినట్లుగా వ్రాయబడియున్నది.[3] ఈ విధంగా నరబలికి బదులుగా జంతువులను (దున్నపోతులను, గొర్రెపోతులు, మేకపోతులు, కోళ్ళు మొ॥) వాటిని బలి ఇవ్వడం జరుగుతుంది. శాఖాహారులైతే దేవతకు జంతువులకు బదులుగా గుమ్మడికాయను, కొబ్బరికాయలను బలి ఇవ్వడం జరుగుతుంది.

**(ఇ) దున్న పోతును బలి ఇవ్వడానికి గల కారణం:**

దున్నపోతును బలి ఇవ్వడానికి గల కారణానికి సంబంధించి జానపదుల్లో ఒక కథ ప్రచారంలో ఉంది. దాన్ని వైట్‌హెడ్ గారు ఈ విధంగా తెలియజేశారు.[4] పూర్వం ఒక పంచమ జాతీయుడు వేదాలను గానం చేస్తూ ఒక ఊరికి వెళ్ళాడట అక్కడ తానొక బ్రాహ్మణుడినని, పండితుడినని అబద్ధం చెప్పి ఆ ఊరి కరణం గారి కుమార్తెను వివాహమాడెనట. వారికి సంతానం కలిగిన కొంత కాలానికి పంచముడు చేసిన మోసం బయటపడగా, అతని భార్యయైన బ్రాహ్మణ యువతి తనకు తాను సజీవ దహన మౌతూ గ్రామవాసులతో ఓ గ్రామ వాసులారా! నా భర్త తలను ఖండించి అతని నోటిలో మోకాలు పెట్టి తలపై దీపం వెలిగించండి" అని చెప్పిందట. సజీవ దహనమైన ఆ యువతి దేవతగా వెలిసిందట. తర్వాత జన్మలో గ్రామ వాసులచే నరకబడ్డ పంచముడు దున్నపోతుగా పుట్టాడట. అప్పటి నుండి దున్నపోతును దేవతకు బలియిచ్చి, దున్నపోతు కుడి మోకాలు నరికి నోటిలో పెట్టుట ఆచారంగా వస్తుందన్న అభిప్రాయం ఊహకు బాగానే వున్నా వాస్తవానికి మాత్రం దూరంగా ఉందని చెప్పవచ్చు. నేడు దున్నపోతుకు బదులుగా గొర్రెపోతులను, మేకపోతులను, కోళ్ళను బలి ఇస్తున్నారు.

**(ఈ) బలిగా ఇవ్వదగినవి :**

కాళికా పురాణంలో యేయే జంతువులను బలి ఇవ్వ వచ్చునో చెప్పబడింది.[5] అని పక్షులు, తాబేళ్ళు, మొసళ్ళు, చేపలు, ఎనుబోతులు, ఎద్దులు, మేకపోతులు, అడవిపందులు, ఖడ్గమృగములు, జింకలు, ఉడుములు,

సింహములు, పులుపు మొదలైనవి. ఇవే గాక మనిషి రక్తాన్ని కూడా సమర్పించవచ్చునట.

దేవతకు బలి తప్పనిసరి అన్న అభిప్రాయం ప్రజల్లో ఇప్పటికీ ఉండడం వలన బలిని నిషేధిస్తూ ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా గ్రామ ప్రాంత ప్రజలే గాక పట్టణ ప్రాంత ప్రజలు అంటే నిరక్షరాస్యులతో పాటుగా అక్షరాస్యులు కూడా దేవతకు బలి ఇచ్చి అ రక్తాన్ని అర్పించడం జరుగుతూనే వుంది. ప్రజల దృక్పథంలో మార్పు రానంత వరకు ఎన్ని చట్టాలు చేసినా, వైజ్ఞానికంగా దేశం ఎంత అభివృద్ధి చెందినా తరాలు మారుతున్నా ఈ ఆచారం కొనసాగుతూనే ఉంటుంది.

దేవాలయాలను సామాన్యంగా అందరికీ కనిపించే విధంగా ఊరి మధ్యలో ఎత్తైన ప్రదేశాలలో నిర్మించడం జరుగుతుంది. అయితే గ్రామ దేవతాలయాలు మాత్రం గ్రామం వెలుపట చెట్ల (వేప, రావి) కింద గాని, చెరువు గట్ల కింద గాని నెలకొని యుండుటను చూస్తుంటారు. కుంకుమలతో అలంకరించిన రాళ్ళను, చెట్లను, పుట్టలను, దేవతలుగా భావించి పూజించుటకు కూడా చూస్తుంటాం. దానికి కారణం.

(అ) ప్రతి వస్తువులోను దైవాన్ని చూడడం (రాళ్ళు, పుట్టలు మొ॥)

(ఆ) చెట్లు సూర్యుని వేడి నుండి, వర్షం నుండి రక్షణ నివ్వడమే గాక వాటికి కూడా ఆత్మ ఉంటుందని, దేవతల శక్తులకు, ఆత్మలకు చెట్లు నివాస స్థలాలని నమ్మడం వలన వాటిని (చెట్లను) దేవతలుగా పూజించడమేగాక, వాటికిందనే దేవతకు నివాస స్థలాన్ని ఏర్పరిచారు.

గ్రామ దేవతలకు సంబంధించి వృక్షాలతో రావి, వేపలకు అధిక ప్రాధాన్యత నివ్వడం జరిగింది. ఎందుకంటే రావి మహా విష్ణువు అంశగా, వేప లక్ష్మీ అంశగా మహాత్ములు నిర్ణయించడమే. దీని యొక్క పవిత్రత వర్ణనాతీతమైనది. ఇక వేప దివ్యౌషధి, క్రిమిసంహారియేగాక వేప గాని చలువను, ఆరోగ్యాన్ని ఇస్తుంది గనుక ఎవరికైనా అమ్మ వారొచ్చినప్పుడు (పొంగు, మశూచికం, ఆటలమ్మ వంటివి) వేపాకు నూరి దాన్ని పసుపుతో కలిపి, ఆ ముద్దను మింగించడమే గాక అమ్మవారొచ్చి తగ్గాక ఆ ముద్దను ఒంటికి రాసి స్నానం చేయిస్తారు. ఈ విధంగా వేప వలన ఎన్నో ప్రయోజనాలుండడం వలన గ్రామ దేవతలకు జాతర చేయునపుడు ఆలయ ప్రాంగణంలో వేపాకు తోరణాలను కడతారు. జాతర సమయంలో సంచార అమ్మవారిగా ఊరేగించే గరగకు వేపాకులను కట్టడమేగాక ఊరేగింపు జరుగునప్పుడు పూనకంతో నున్నవారు వేప మండలను పట్టుకొని ఊరేగడం చూస్తుంటాం. ఈ విధంగా వృక్షాలలో వేపకు గ్రామ దేవతల జాతరలలో ప్రాధాన్యత కన్పిస్తుంది. చెట్లను, చెట్టు కిందనున్న రాళ్ళను దేవతగా భావించి పూజించిన మానవుడు ఆ తరువాత కొంతకాలానికి దేవతను మనిషి రూపంలోనే ఊహించుకొని, చెట్ల కిందనే ఆలయాన్ని నిర్మించి అందులో కొయ్య / రాతితో చేసిన విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాదికొక సారైనా జాతర పేరిట పూజించడం జరిగింది.

ఇక ఊరి పొలిమేరల్లో గ్రామ దేవతాలయాలు ఉండడాన్ని కారణం

(అ) దేవత ఊరి పొలిమేర దాటి ఏ దుష్టశక్తి గ్రామంలోనికి ప్రవేశింపనీయకుండా ఊరి వెలుపట కాపలా కాస్తుందని,

(ఆ) దేవత అనుగ్రహాన్ని సంపాదించడానికి బలుల ద్వారా దేవతను సంతృప్తి పరచుట వలన రక్తపాతం జరుగుతుందని గ్రామ దేవతాలయాలను ఊరి చివర నిర్మించి యుండవచ్చు.

కారణాలు ఏమైనప్పటికిని ఇప్పుడు మాత్రం అత్యధిక జనాభా కారణంగా ఊరి చివర్ల వరకు ఇండ్ల నిర్మాణం జరగడం వలన చాలా మట్టుకు గ్రామ దేవతాలయాలు ఊరి మధ్యనే కన్పిస్తున్నాయి. బలుల కారణంగా రక్తపాతం జరుగుతుంది గనుక గ్రామదేవతాలయానికి ఆనుకొని ఇండ్లు నిర్మించడం వలన అరిష్టం కలుగుతుందన్న భయంతో ప్రజలు ఆలయ ప్రాంగణానికి సుమారు 200 గజాల దూరంలో ఇండ్లు నిర్మించుకోవడం జరుగుతుంది.

గ్రామదేవతల ఆలయాలలో నిత్య ఆరాధన గాని, అష్టోత్తర శతనామాలు చదివే సంప్రదాయం గాని ఉండదు. సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో, మూడు సంవత్సరాలకో ఒకసారి దేవతను సంతృప్తి పరచడానికి జాతర / ఉత్సవం / కొలుపు జరిపిస్తారు. జాతర / ఉత్సవాలకు నిర్ణీత కాలము, నిర్ణీత సమయం అంటూ ఏమీ ఉండదు. ఎక్కువగా పంటలు పండిన పిదప, అంటు వ్యాధులు, ప్రబలినప్పుడు జాతర / ఉత్సవాలు జరిపి మొక్కుబడులు చెల్లించుకుంటారు.

గ్రామదేవతాలయాలలో బ్రాహ్మణేతరులు పూజారులుగా ఉంటారు. అందుక్కారణం బలి విధానమే అయితే ఇప్పుడిప్పుడు దేవాదాయశాఖ ఆధినంలోనున్న గ్రామదేవతాలయాలలో మాత్రం బ్రాహ్మణులను కూడా పూజారులుగా నియమించి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నిత్య ఆరాధన జరిపిస్తున్నారు. ఇక్కడ జంతువులకు బదులుగా గుమ్మడికాయలను బలి ఇస్తున్నారు. ఈ దేవాదాయ శాఖ ఆధీనంలోనున్న గ్రామ దేవతకు జంతుబలి ఇవ్వదలచినవారు బలి పశువును దేవతకు చూపించి దాన్ని ఆలయ ప్రాంగణానికి దూరంగా బలి ఇవ్వడం జరుగుతుంది. బలిని నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసినప్పటికీ ఈ దేవాదాయ శాఖ ఆధీనంలోనున్న దేవతకు బలి ఇవ్వకుండా చేస్తే ఆలయానికి వచ్చే రాబడి తగ్గిపోతుందన్న భయంతో దేవాదాయ శాఖ వారు నిర్బంధాలేమీ పెట్టలేదు.

గ్రామదేవతల ఆలయాలలో పురుషులే గాక స్త్రీలు కూడా అర్చకత్వం నిర్వహిస్తుంటారు.

**జాతర సందర్భంగా ఆచరించే పద్ధతులు – కార్యక్రమాలు :**

**తీరాంధ్ర ప్రాంతంలో** – చాటింపు వేయుట, గరగల ఊరేగింపు, బండార్నీళ్ళు పోయుట, అమ్మవారిని (గరగతను) నడి వీధికి తీసుకువచ్చుట, పూరింట్లో గరగల నుంచుట, అమ్మవారి సేవ, (గరగలకు సేవ), చద్దినైవేద్యం, పరగంగ నైవేద్యం, గమల గుడుపు, కోడిపిల్లల ఎర, గావు పట్టుట, కల్లు సాక పోయుట, దండకం చదువుట, చల్లఘటం ఊరేగించుట, అమ్మవారికి అభిషేకం చేయించుట, అమ్మవారికి పానుపు వేయుట, కుంభం పోయుట,

బలులను ఇచ్చుట, పొలి చల్లుట, మొక్కుబళ్ళు (జంతువుల బలి, కావిడి కోళ్ళు, గండ దీపం, గరగలు) చెల్లించుట వంటి పద్దతులను ఆచరిస్తారు. ఈ ప్రాంతంలో సిరిమానోత్సవం, తొలేళ్ళ ఉత్సవం చెప్పుకోదగ్గ కార్యక్రమాలు.

**రాయలసీమ ప్రాంతంలో** – చాటింపు వేయుట, గరగలు నిలుపుట, గరగలకు నిత్య ఆరాధన జరిపించుట, కుంభం, బలిచ్చే జంతువును ఊరేగించుట, శిగాలు (పూనకాలు) ఊగుట, బలి కార్యక్రమం, పొలి చల్లుట, అమ్మవారి నిమజ్జనం వంటి పద్ధతులను ఆచరిస్తారు. శస్త్రాలను గుచ్చుకోవడం, అగ్నిగుండం తొక్కే కార్యక్రమాలు జరిపిస్తారు.

**తెలంగాణ ప్రాంతంలో** – బియ్యం కొల, అమ్మవారికభిషేకం, అలంకరణ, మహిమలను కీర్తించుట, గావు పట్టుట, పూనకాలు, కుంభం, దున్నపోతు బలి, పొలి చెల్లుట, రంగం ఎక్కుట వంటి పద్దతులను ఆచరిస్తారు. తెలంగాణ ప్రాంతంలో హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల్లో బోనాల పేరిట అమ్మవారికి జాతరలు జరిపిస్తారు. ఈ బోనాల పండగల సందర్భంగా సాక పోయుట ఘటం ఎదుర్కోలు, అమ్మవారికి అభిషేకం చేయించుట, బోనాల సమర్పణ బలి కార్యక్రమం (గుమ్మడికాయను బలి ఇవ్వడం, తొట్టెల సమర్పణ, రంగం ఎక్కుట, ఘట నిమర్జనం వంటి పద్దతులను ఆచరిస్తారు. నిప్పులగుండం తొక్కుట వంటి కార్యక్రమాలను జరిగిస్తారు.

పైన చెప్పిన మూడు ప్రాంతాలలో ఇంచుమించు ఒకేలా ఆచరించే పద్ధతులను ఇప్పుడు కొంత పరిశీలిద్దాము

**బలి :** బలి అంటే ఆహుతి ఇవ్వటం అని అర్థం. అలౌకిక జీవులకు, శక్తులకు భూతాలకు, కృతజ్ఞతా రూపంలో కానుకలను అర్పించుటనే బలి అనవచ్చును. ఈ కానుకలు దూపం, పుష్పం, మద్యం ప్రాణిలేక మానవరూపంలో ఉండవచ్చు ప్రాచీన కాలం నుంచి బలిని పవిత్రమైనదిగా యెంచి మద్య మాంస నివేదన రక్తము అనిన దేవతకు ప్రీతి అని విశ్వసించుటచేత గ్రామ దేవతలకు నరులను గాని, జంతువులను గాని, బలి ఇవ్వడం జరిగింది. దాని కారణంగా బలి అనగా నరబలి లేదా జంతుబలి అన్న అర్థమే మిగిలిపోయింది.

బలి ఇచ్చుట అనునది హింసతో కూడుకొన్నదగుట చేతను జుగుప్సను కలిగించుట వలనను మరొక ప్రాణిని భగవంతుని పేరిట బలి ఇచ్చుట పాపం అని ప్రభుత్వం బలిని నిషేధించినప్పటికిని మారుమూల గ్రామాలలోనే గాక పట్టణాలలో కూడా ఈ బలి ఇచ్చే విధానం కొనసాగుతునే ఉంది. మరికొన్ని చోట్ల జంతువును బలి ఇచ్చుటకు బదులుగా గుమ్మడి కాయలను గాని కొబ్బరికాయలను గాని దేవతకు సమర్పించుటం జరుగుతుంది.

ప్రభుత్వం బలులను నిషేధించినప్పటికిని నేడు గ్రామదేవతల జాతరలలో మేక / గొఱ్ఱె పోతులను గాని, కోళ్ళను గాని బలి ఇవ్వడం జరుగుతుంది. కొన్ని చోట్ల దున్నపోతును బలి ఇచ్చే ఆచారం ఇప్పటికీ కొనసాగుచూనే ఉన్నదట. దేవాలయానికొచ్చే రాబడి తగ్గిపోకుండా ఉండుటకై బలిని నిషేధిస్తూ ప్రభుత్వం

చట్టం చేసినప్పటికీని కొన్ని ప్రసిద్ధి చెందిన గ్రామదేవత ఆలయాలలో బలినిచ్చుటకు ప్రభుత్వమే ప్రాంగణాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఏది ఏమైనప్పటిని గ్రామ దేవతల జాతరలలో బలియిచ్చే ఆచారం కొనసాగుచునే యున్నదని చెప్పవచ్చును.

దేవతను ప్రతిష్ఠించే ముందు, ప్రతిష్ఠించాక జంతువును బలి ఇస్తారు. జాతరలో బలి ఇచ్చే జంతువును ఎలా నిర్ణయిస్తారో చూద్దాం.

బలియిచ్చే జంతువును ముందుగానే నిర్ణయిస్తారు. అది అంగవైకల్యం లేనిదై ఉండాలి. దేవుని పేరిట దానిని సంవత్సరం క్రితమే వదిలిపెడతారు. అది దేవుని పోతు గనుక దానినెవ్వరు అదిలించడం గాని కొట్టడం గాని చేయరు. కొన్ని ప్రాంతాలలో గ్రామంలోని పశువులనన్నింటిని ఒక దొడ్లోకి తోలి తడకపెట్టి వాటిపై పొలి చల్లుతారు. ఆ తరువాత పశువులనన్నింటిని బెదిరించి తడక తీసినప్పుడు మొదట ఏ పశువైతే బయటకు వస్తుందో దానిని వచ్చే జాతరకు బలి పశువుగా నిర్ణయిస్తారు. దీనినే **దేవత పోతు** అంటారు. ఇలా దేవతకు బలిగా సమర్పించే జంతువును ముందుగా నిర్ణయించడం జరుగుతుంది.

బలి ఇచ్చే జంతువును బలి ఇవ్వడానికి ముందు శుద్ధి చేసి, పసుపు కుంకుమలతో అలంకరించి, మెడలో దండవేసి ఊరేగిస్తారు. ఇలా ఊరేగిస్తూ ప్రతి ఇంటి ముందు కొచ్చినప్పుడు ఆ ఇంటివారు దాని కాళ్ళపైన నీళ్ళు పోస్తారు. దేవత గుడి చుట్టూ కూడా ప్రదక్షిణలు చేయిస్తారు. తరువాత దేవత ముందు నిలబెడతారు. బలి పశువు తల విదిలిస్తే దేవత ఆజ్ఞ ఇచ్చిందని బలి ఇవ్వడానికి తీసుకు వెళ్ళి ఒక్క వేటుతో దాని తలను నరుకుతారు లేదా గావు పడ్తారు. గావు పట్టగా వచ్చిన రక్తాన్ని కుంభంలో కలుపుతారు. లేదంటే బలియిచ్చే జంతువు రక్తం కుంభంపై పడేటట్లు చూస్తారు.

కొన్నిసార్లు బలి ఇచ్చి ఆ రక్తాన్ని మూకుడులో పట్టి, ఆ రక్తాన్ని అన్నపు రాశిపై నలుమూలలు చల్లుతారు. బలియిచ్చిన జంతువు యొక్క రక్తాన్ని (మూకుడులో పెట్టి) నరికిన తలను, కాళ్ళను దేవత ముందుంచుతారు. కొన్నిచోట్ల బలియిచ్చిన జంతువు రక్తాన్ని మూకుడులో పట్టి అందులో నవధాన్యాలు జల్లి అమ్మవారి ముందుంచుతారు. 3వ రోజు చూడగా ఏ విత్తనాలు బాగా మొలకెత్తినవో ఆ పంట బాగా పండునని అమ్మవారు సూచించినట్లుగా భావిస్తారు. కొన్నిచోట్ల బలి యిచ్చాక ఆ రక్తాన్ని ఒక గుడ్డలో పట్టి ఆ గుడ్డను ఎండబెట్టి గ్రామస్థులంతా ఆ గుడ్డను చిన్న చిన్న ముక్కలుగా చేసి పంచుకొని నాట్లువేసేటప్పుడు, కోత సమయంలో ఆ గుడ్డముక్కను అంటించి పంటకు పొగవేస్తారు.

**గావు పట్టుట :** మొక్కుకున్న జంతువు యొక్క దౌడనుగాని, ఆయువుపట్టు మెడ నరాన్ని గాని నోటితో లాగి లేదా కొరికి చంపుటనే గావు పట్టుట అంటారు. జాతర సమయంలో అసాది గరగలను నెత్తిపై పెట్టుకొని డప్పు వాయిద్యాల కనుగుణంగా నృత్యం చేస్తూ గ్రామంలో తిరుగుతున్నప్పుడు దేవత పూనక రూపంలో అతనిని అవహిస్తుంది. ఈ సమయంలో మొక్కుకొన్న వారు కోడిపిల్లలను అసాదికందించగా అతడు వాటి మెడకొరికి

చంపి ఆ రక్తాన్ని గరగలకు పూస్తాడు.

**శిగాలు ఊగుట :**జాతర సమయంలో దేవతలు శక్తి రూపమున కొందరిపై అవహించుటనే పూనకములు అని అంటారు. ఈ పూనక సమయంలో వారు వేయు గంతులను శిగాలూగుట అని అంటారు. శక్తి ఆవహించిన వారిని శివశక్తులు అని అంటారు. ఈ పూనకం ద్వారా దేవత కోరిన కోర్కెలను శివశక్తులు భక్తులకు తెలియజేస్తారు. వాటిని తీరుస్తామని భక్తులు చెప్పి ఆ దేవతను శాంతింపజేస్తారు.

**కుంభం :** అమ్మవారి గుడి ముందు అన్నాన్ని వండి కుంభంగా పోసి, అమ్మవారికి నైవేద్యంగా పెడతారు. గ్రామస్థులంతా వచ్చి కుంభాన్ని (అన్నపు రాశిని) దర్శించి, దానిపై డబ్బులు వేసి వెళ్ళిపోతారు. ఆ తరువాత బలి పశువును బలియిచ్చాక, ఆ రక్తాన్ని నైవేద్యపుటన్నంతో (అన్నపు రాశిలో) కలిపి పొలిచేసి ఇళ్ళపైన, పశువులపైనా, పొలాలలో, సరిహద్దులలో చల్లుతారు.

**సాకపోయడం / కల్లు పారపోయుట :** సాక పోయడం అనగా కల్లును వారపుచ్చడమని అర్థం. కల్లు వారపుచ్చడమంటే దేవతకు నివేదించిన నైవేద్యం ముందు కల్లును అడ్డంగా ఒక సరళరేఖగా పోయడమని అర్థం. ఈ విధంగా మన ఎడమ నుండి కుడికి మూడుసార్లు అమ్మవారికి చూపిస్తూ ఆరగింపుగా పోసి, గుగ్గిలం లేదా సాంబ్రాణి ధూపం వేసి సాష్టాంగ దండ ప్రణామం చేస్తారు.

**పొలిచల్లుట :** దుష్టశక్తుల నివారణకై బలియిచ్చిన జంతువు రక్తాన్ని అమ్మవారి ముందుంచిన కుంభం (అన్నపురాశి)లో కలిపి, ఈ మిశ్రమాన్ని పంట పొలాలలో, పశువులపై, పొలిమేరలలో చల్లుటనే పొలిచల్లుట అంటారు.

బలియిచ్చిన పిదప కల్లు మత్తులోనున్న ఆసాది (పుజారి) బలిపశువు రక్తాన్ని తాగి, పేగులు మెడలో వేసుకొని, దొబ్బను నోట కరుచుకొని, నెత్తిపై గండదీపం పెట్టుకొని గ్రామ పెద్దలతో కలసి బలికూడును గ్రామ పొలిమేరలలో చల్లుతూ 'బలిపొలి' అంటూ నినాదాలు చేసుకొంటూ వెళ్తాడు. పొలిని చల్లు సమయంలో ఎవ్వరూ ఎదురుగా రావడంగాని, కనిపించడంగాని, ఊరు విడిచి వెళ్ళడం గాని, వేరే ఊరు వారు ఈ ఊరికి రావడం గాని జరగకూడదు. ఒకవేళ అలా జరిగితే వాళ్ళు చనిపోవడం గ్రామానికి అరిష్టం కలుగుతుందని గ్రామ ప్రజల నమ్మకం.

ఇంతవరకు మూడు ప్రాంతాలలో సర్వసాధారణంగా ఆచరిస్తున్న పద్ధతులను చూసాము. ఇక మిగిలిన వాటిని గూర్చి కూడా తెలిసికొందాం.

**చాటు పెట్టుట :** చాటుపెట్టుట అంటే చాటింపు వేయుట అని అర్థం. గ్రామదేవత జాతర జరిపించే దినాన్ని నిర్ణయించాక ఆ విషయాన్ని గ్రామస్థులకు తెలుపుట కొరకై చాటింపు వేయిస్తారు. చాటింపు వేయడం వలన పనులమీద బైటకు వెళ్ళినవారు జాతర సమయానికి గ్రామానికి చేరుకొంటారు. జాతర సమయంలో ఎవ్వరూ

గ్రామాన్ని వదలి వెళ్ళరాదను నియమ ముండుటచే గ్రామస్థులకు ముందుగా తెలియజేయుటకు ఇలా చాటింపు వేయిస్తారు.

**బియ్యం కొల :** కొన్ని గ్రామాలలో జాతర సందర్భంగా కుంభం పోయుటకు కావలసిన బియ్యాన్ని ముందుగా ప్రతీ ఇంటికి వెళ్ళి సేకరిస్తారు. దీనినే బియ్యం కొల అని అంటారు. ఈ బియ్యం కొల కార్యక్రమం ద్వారా గ్రామస్థులు అమ్మవారి జాతర సమీపంగా ఉందని గ్రహించి, జాతరకొరకు సిద్ధపాటుతో ఉంటారు.

**గరగల ఊరేగింపు :** జాతరల సందర్భంగా సంచార అమ్మవారిగా భావించి, గరగలను ఊరేగిస్తారు. ఇది ఇత్తడితో కుండలా చేయబడి, దాని మూతి చుట్టూ పడగ విప్పిన పాము చుట్టబడి ఉంటుంది. దీనికి కుచ్చిళ్ళు పోసి కోక చుట్టి పసుపు కుంకుమలు పెట్టి, వేపాకులను చుట్టి అందంగా అలంకరిస్తారు. ఈ గరగలను నెత్తిమీద పెట్టుకొని డప్పు వాయిద్యాల కనుగుణంగా నృత్యం చేస్తూ ఆసాది ప్రతి ఇంటి ముందు నిలబడతాడు. అమ్మవారే తమ ఇంటి ముందుకు వచ్చి నిలువ బడినట్లుగా గ్రామస్థులు భావించి ఆసాది కాళ్ళపై పసుపు కలిపిన నీటిని పోసి పూజిస్తారు. గరగల ఊరేగింపు ద్వారా లేవలేని స్థితిలో నున్న వారు ఆలయానికి వెళ్ళి దర్శించుకోలేని వారు అమ్మవారే తమ ముందుకువచ్చి నిలువ బడిందని గరగలని సంచార అమ్మవారిగా భావించి పూజిస్తారు.

**బండార్నీళ్ళు పోయుట:** బండారు అంటే పసుపు. పసుపు కలిపిన నీటిని గరగలను ఎత్తుకొని వచ్చిన ఆసాది కాళ్ళపైనే గాక బలి ఇచ్చే జంతువును ఊరేగించేటప్పుడు కూడా ఆ జంతువు కాళ్ళపై కూడా పోస్తారు.

**అమ్మవారిని నడివీధిలోకి తీసుకువచ్చుట:** జాతరకు ముందు అమ్మవారిని (గరగలను) అత్తింటి నుండి పుట్టింటికి తీసుకు వచ్చుటనే అమ్మవారిని నడి వీధికి తీసుకు వచ్చుట అని అంటారు. మంగళ, శుక్రవారాలలో మినహాయించి మిగిలిన రోజుల్లో ఎప్పుడైనా అమ్మ వారిని పుట్టింటికి తీసుకువస్తారు. అమ్మవారిని నడి వీధికి తీసుకువచ్చే ముందు ఆసాది గరగలను నెత్తిమీద పెట్టుకొని ఇంటింటికి తిరిగి చివరకు ప్రత్యేకంగా జాతర కొరకు ఏర్పాటు చేసిన స్థలానికి (నడి వీధికి) తీసుకువెళ్తాడు.

**పూరింట్లో గరగలనుంచుట :** నడివీధిలో జాతర కొరకు ఏర్పాటు చేయబడిన స్థలంలో వేసిన పూరింట్లో (పూరి గుడిసె) చుట్టు మూడుసార్లు తిరిగి, అక్కడ గరగలను ఉంచుతాడు. ఆ తరువాత గుగ్గిలం ధూపం వేసి కల్లు లేదా పానకాన్ని వారబోస్తాడు. పూరింట్లో గరగల నుంచినప్పటి నుండి జాతర అయ్యేవరకు నిత్యనైవేద్యం పెడతాడు.

**అమ్మవారి సేవ :** డప్పు వాయిద్యాల కనుగుణంగా గరగ నృత్యాలు చేస్తూ వివిధ వినోద కార్యక్రమాలను ప్రదర్శిస్తూ, అమ్మవారి పూనకాలతో రాత్రంతా గ్రామంలో తిరుగుతూ జరిపించే వేడుకనే అమ్మవారి సేవ అంటారు. ఇది రాత్రి ప్రారంభమై ఉదయానికి ముగుస్తుంది. ఇలా అమ్మవారి సేవను ఒక రోజు గాని, ఐదు రోజులు గాని, ఇంకా ఎక్కువ రోజులుగాని జరిగించవచ్చు.

**చద్ది నైవేద్యం:** ముందురోజు రాత్రి వండిన అన్నంలో గంజిలేదా పెరుగువేసి, బెల్లం ముక్క పెట్టి దానిని నైవేద్యంగా అమ్మవారికి సమర్పించుట. చద్దన్నం తింటే కడుపుకు చలవ గనుక దేవతను శాంతింపజేయుటకు చద్ది అన్నాన్ని నైవేద్యంగా పెడతారు.

**పరగంగ నైవేద్యం :** అమ్మ వారికోసం ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని పరగంగ నైవేద్యం అంటారు. అన్నం, పప్పు, మునగకూర అరిటాకులో పెట్టి దేవతకు సమర్పిస్తారు.

**గమలగుడుపు :** గరగ నృత్యం చేసుకొంటూ ఊరేగింపుగా వెళ్తున్న ఆసాదుల్లో ఒకరు ఒకచోట ఆగిపోయి ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యకుండా ఆవేశంతో ఊగిపోతూ గట్టిగా (అమ్మవారు ఆవహించుటకు) కేకలు వేయడాన్ని 'గమ' అంటారు. గమ పట్టిన ఆసాదికి డప్పులను జోరుగా వాయిస్తూ గుగ్గిలం పొగ వేస్తూ ఏం కావాలని అడుగుతారు. కోడి పిల్లలను ఎరగా అందిస్తుంటే గమ పట్టిన ఆసాది వాటి మెడ కొరికి నేలపై కొడుతుంటాడు ఇలా అమ్మవారిని శాంతింప జేస్తారు.

**దండకం చదువుట (ఆగం చెప్పుట) :** దేవత యొక్క మహిమలను, పుట్టుకను, మాహాత్మ్యయులను, స్వరూప స్వభావాదులను, వేష భూషదుములను గురించి కీర్తించడాన్ని "దండకము చదువుట" అంటారు. జాతర సందర్భంగా దేవతలకు దండకాలను చదువుట గమనించవచ్చు. ఈ దండకంలో అకుంఠిత భక్తి, భావావేశం, భావోద్రిక్తత ప్రదర్శింపబడతాయి. ఇది ఇతివృత్త రహితము, స్తుతి పూర్వకమై ఉంటుంది.

**అమ్మవారికి అభిషేకం చేయించుట :** జాతరకు ముందు అమ్మవారి విగ్రహానికి పుణ్యనదీ జలాలతో అభిషేకం చేయిస్తారు. ఇలా చేయడం వలన విగ్రహాలకున్న దుమ్ము ధూళి తొలగి పోయి పవిత్రంగా ఉండాలని.

**అమ్మవారి పాన్పు :**పొడవాటి బల్లపై శుభ్రమైన వస్త్రాన్ని వేసి, దానిపై అలంకరించిన గరగలనుంచి ఆసాది వేపాకులతో విసురుతుంటాడు. లేదా అమ్మవారికి ఉయ్యాలలు కట్టి అందులో గరగల నుంచి ఊపుతారు. దీనినే అమ్మ వారిపాన్పు అంటారు. ఇలా అమ్మవారికి పాన్పు వేస్తే తొందరగా పెళ్ళిళ్ళు జరుగుతాయని ప్రజలు విశ్వసిస్తారు.

**అమ్మవారిని అత్త వారింటికి సాగనంపుట :** జాతర అయ్యాక నడివీధికి తీసుకొని వచ్చిన అమ్మవారి ప్రతిరూపాలను (గరగలను) తిరిగి గుడికి చేర్చుటనే అమ్మవారిని అత్త వారింటికి సాగనంపుట అని అంటారు. అమ్మవారిని అత్తింటికి తీసుకొని వెళ్ళడానికి బయలుదేరుతూ ఒక గంట పూరింటి వద్ద గరగనృత్యం చేస్తారు. అమ్మవారు వీధి మలుపు తిరిగాక అమ్మవారున్న ఆచోట మరెవ్వరూ ఉండకూడదని ఆ పూరిల్లును అంటించి వేస్తారు.

**మొక్కుబళ్ళు చెల్లించుట :** జాతర సందర్భంగా దేవతకు తమ మొక్కుబళ్ళు చెల్లించుకొంటారు. కోడి, మేక, గొఱ్ఱె, దున్నపోతు వంటివే గాక వాటితో పాటుగా మరికొన్నిటిని మొక్కుకుంటారు అవి.

1. గరగల మొక్కు – పొంగు, మశూచికం, ఆటలమ్మ వంటి రోగాలు నయం చేస్తే గరగల్ని సమర్పిస్తామని

మొక్కుకొని జాతర సమయంలో అలంకరించిన గరగలను ఆసాదికి సమర్పించుకొంటారు. మరికొందరు కావిడి కోళ్ళు / కోళ్ళ కావిడిని మొక్కుకొంటారు. కోళ్ళ కావిడిని మొక్కుకొన్న వ్యక్తి ఒక కర్రకు రెండువైపులా ఒక్కొక్క కోడి పుంజు యొక్క కాళ్ళు కట్టి వ్రేలాడదీస్తాడు. దీనినే కావిడి కోళ్ళు అంటారు. జాతర సమయంలో ఈ కావిడి కోళ్ళను భుజాన పెట్టుకొని తలపాగా చుట్టుకొని అఖండ దీపాన్ని నెత్తిన పెట్టుకొని మొక్కుకొన్న వ్యక్తి అమ్మ వారికి వాటిని సమర్పిస్తాడు.

**గరగలు నిలుపుట :** దీనినే ఘట స్థాపన అని కూడా అంటారు. జాతర సందర్భంగా ఒక ప్రత్యేక స్థలమునగాని, గుడిలో గాని గరగలను లేదా ఘటాలను అలంకరించి నిలబెట్టుట

**అమ్మవారికి నిత్య ఆరాధన జరిగించుట :**ప్రసిద్ధి చెందిన గ్రామ దేవతల ఆలయాలలో దేవాదాయ శాఖ ఆధీనంలో నున్నవి) అమ్మవారికి సంవత్సరం పొడుగునా నిత్యము ఆరాధన జరిగిస్తుంటారు. అయితే కొంత మంది దేవతలను జాతర జరిగించే సమయంలోనే ధూప దీప నైవేద్యాలతో ఆరాధిస్తారు.

**అమ్మవారి నిమజ్జనం :** జాతర ముగిసాక అమ్మవారిని (ఘటాలను) తీసుకొని వెళ్ళి నిమజ్జనం (నీటిలో వేయుట) చేస్తారు.

తెలుగు రాష్ట్రాలలో గ్రామ దేవతలను ఆరాధించే ఉద్దేశంలో ప్రాంతాల వారిగా తేడాలు లేనప్పటికి వాటిని ప్రజలు భక్తి ప్రపత్తులతో జరుపుకొనే పూజా విధానంలో కోస్తాంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో కొంత భిన్నంగా జరుగుతుండటం గమనిస్తాము. చట్టారీత్య జంతుబలిని నిషేధించినప్పటికి ప్రాంతాలకతీతంగా ప్రజలు బాహాటంగా ఆలయానికి కొద్దిపాటి దూరంలో జంతువులను బలిచ్చి వాటి రక్తాన్ని నైవేద్యంగా గ్రామ దేవతలకు అర్పిస్తూనే ఉన్నారు. ఈ ఆచారం ఆలయ పరిసర ప్రాంతాలలో వాతావరణ కాలుష్యానికి దారి తీస్తుంది. గ్రామ దేవతాలయాల్లో అన్ని ప్రాంతాల్లో అర్చకులు బ్రాహ్మణేతరులే ఉండటం గమనార్హం. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగే గ్రామదేవతాలయాల్లో వంశపారంపర్య అర్చకత్వం కొనసాగించే విధానంలో వయోపరిమితిని ప్రవేశపెట్టడం వలన వివిధ కులాల వారికి రిజర్వేషన్ మేరకు అర్చక అవకాశాలు ఉపాధిగా లభిస్తున్నాయి. గ్రామ దేవత ఆలయాల నిర్వహణలో ట్రస్టీలు రాజకీయ ప్రలోభాలకు లోబడి, వ్యాపార దృక్పథంతో వివిధ సామాజిక వర్గాల వారికి ఆలయ ప్రాంగణంలో వ్యాపార అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఇలాంటి బంధుప్రీతి విధానం వలన వివిధ వర్గాల వారు వాటికోసం పోటీపడే అవకాశం కనిపిస్తుంది.

**సూచికలు :**

1. తెలుగు జానపద సాహిత్యం – పురాగాథలు, డా. రావి ప్రేమలత పుట. 163
2. The Village Gods of South India, Henry White Head P.11
3. పరిశుద్ధగ్రంథము – ఆదికాండం, 22వ అధ్యాయం పుట. 1–14 వచనాలు
4. తెలంగాణ జాతరలో జానపద విజ్ఞానం – నల్లగొండ జిల్లా ప్రత్యేకత, సి. హెచ్. యాదయ్య పు. 188